RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ


కరీంనగర్ శనివారం 27.12. 2025 సంపుటి : 03 సంచిక : 26 పేజీలు : 08 వెల: రూ.5

Karimnagar Sturday 27.12.2025 Volume: 03 Issue 26 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## సింగరేణిలో ఉత్పత్తి మాసాల మాటేది?

2



### జీ రామ్ జీపై

# కాంగ్రెస్ జంగ్‌సైరన్

## దేశవ్యాప్తంగా పోరుకు సిద్ధమైన హస్తం పార్టీ

### నేడు ఇందిరా భవన్‌లో సీడబ్ల్యూసీ సమావేశం

### ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి దామోదర

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడంతో పాటు ఆ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై దేశవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో నేడు న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించనుంది.



పథకం నుంచి మహాత్మాగాంధీ పేరును తొలగించి, దానిని 'జీ రామ్ జీ'గా మార్చడం వెనుక ఉన్న రాజకీయ కుట్రను ప్రజలకు వివరించడమే కాకుండా, రాష్ట్రాలపై కేంద్రం మోపుతున్న అదనపు ఆర్థిక భారంపై అవగాహన కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించింది.

7

## అదుపులేని విమర్శలు.. అనవసర శపథాలు

### సీఎం నోటినుంచి ఆ మాటలా?



సీఎం రేవంత్ రెడ్డి నోటి నుంచి తీవ్రమైన భాష రావడం దురదృష్టకరం. తాజాగా కొడంగల్ వేదిక మీద నుంచి కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావుల మీద సీఎం రేవంత్ రెడ్డి వాడిన తీవ్ర పదజాలంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

3

## బీజేపీలోకి రాజాసింగ్?

### పార్టీ ఆహ్వానిస్తే వెళ్తానంటోన్న ఎమ్మెల్యే



**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 26 :** బీజేపీ రాష్ట్ర నాయకత్వం తీరుపై అసంతృప్తితో పార్టీకి రాజీనామా చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మనసు మార్చుకున్నారు. పార్టీ నుంచి ఆహ్వానం అందితే తిరిగి చేరేందుకు సుముఖంగా ఉన్నట్టు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. "ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి.. ఒకరు గొడవ పడి బయటకు వెళితే.. ఎప్పుడో అప్పుడు ఆ సోదరుడు ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుంది. ఈరోజు కాకపోతే రేపు నేను కూడా కుటుంబంలాంటి పార్టీలోకి వెళ్లాల్సి ఉంటుంది. ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో చెప్పలేము" అని వ్యాఖ్యానించారు. బీజేపీకి తాను నిజమైన సైనికుడినని, జాతీయ, రాష్ట్ర కీలక నేతలు పిలిచిన రోజు తిరిగి పార్టీలోకి వెళ్తానని అన్నారు. అసెంబ్లీలో స్వేచ్ఛ ఇవ్వాలని, ఎమ్మెల్యే, ఎంపీలు వారి నియోజకవర్గంలో స్వేచ్ఛగా ఉన్నప్పుడే పార్టీ భవిష్యత్తులో అధికారంలోకి రాగలుగుతుందని అభిప్రాయపడ్డారు. పార్టీ పెద్దల నుంచి తనకు తప్పకుండా పిలుపు వస్తుందని, తమకు స్వేచ్ఛ ఇస్తే బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో యుద్ధం చేస్తామన్నారు.

## 1300 కోట్లతో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణం

### దేశవ్యాప్తంగా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం : కిషన్‌రెడ్డి

### మండలానికో కల్చరల్ భవనం : జూపల్లి

**ఆదిలాబాద్, డిసెంబరు 26 :** హైదరాబాద్ శివారు బీబీనగర్‌లో రూ.1300 కోట్లతో ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయడంతో పాటు పీజీ సీట్లను పెంచుతున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రిలో రూ.23.75 కోట్ల నిధులతో నిర్మించిన క్రిటికల్ కేర్ 50 పడకల ఆస్పత్రిని రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మంచిర్యాల టు నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణానికి సర్వే కొనసాగుతోందన్నారు. భారీ వర్షాలకు రాష్ట్రంలో సోయాబీన్ పంట దెబ్బతిన్నదని, ఈ విషయంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్చి చివరి వరకు పత్తి పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా రాష్ట్ర ఆర్థిక పరి స్థితి ఎంతో అధ్వానంగా ఉందని, అయినా పలు ఆస్పత్రులకు నిధులు కేటాయిస్తున్నామని జూపల్లి అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో విద్య, వైద్యం కోసం ఎంతో చేయాల్సి ఉందన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, పర్యాటకులు పెరుగుతారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో కల్చరల్ భవనాలను నిర్మిస్తామన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పత్రికలు చదవడం మస్ట్

### స్క్రీన్ టైమ్ తగ్గించేందుకు యూపీ ప్రభుత్వం ఉత్తర్వులు

**లక్నో:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇకపై పత్రికలను తప్పనిసరిగా చదవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేటి తరం విద్యార్థులు ఎక్కువ కాలం మొబైల్, కంప్యూటర్లతో గడుపుతున్న క్రమంలో వారి స్క్రీన్ టైమింగ్‌ను తగ్గించి వారిలో పఠనాసక్తిని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక, విద్యార్థులు తప్పనిసరిగా పత్రికలను చదవాలని ఆదేశించిన ప్రభుత్వం, ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని కోసం పాఠశాల లైబ్రరీలో హిందీ, ఇంగ్లిష్ పేపర్లు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. నిర్దేశిత సమయంలో వెళ్లి పత్రికల్లోని ఎడిటోరియల్, జాతీయ, అంతర్జాతీయ, క్రీడా వార్తలను విద్యార్థులు రొటేషన్ విధానంలో చదవాల్సి ఉంటుంది. అదే సమయంలో 'వర్డ్ ఆఫ్ ద డే' ఎక్సర్‌సైజ్‌ను కూడా నిర్వహిస్తారు. ఆ రోజు పత్రికల్లోని ఐదు కష్టమైన పదాలను ఎంపిక చేసి వాటిని నోటీస్‌బోర్డ్‌పై రాస్తారు. దీని ద్వారా విద్యార్థుల్లో పదజాలంపై పట్టు పెరుగుతుంది. పత్రికలు చదవడం ద్వారా విద్యార్థుల్లో జీకే, పదజాలం, విమర్శనాత్మక ఆలోచన, ఏకాగ్రత, సామాజిక చైతన్యం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.



# సింగరేణిలో ఉత్పత్తి మాసాల మాటేది?

**కార్మికుల ప్రోత్సాహకాలను మరిచిన యాజమాన్యం**

**ఇన్సెంటివ్ ప్రకటనలో మొండి చేయి**

**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 26:**

సింగరేణిలో ఉత్పత్తి మాసాల మాటను యాజమాన్యం మరిచిపోయింది. బొగ్గు ఉత్పత్తిలో కీలకమైన ఈ అంశాన్ని పట్టించుకోకుండా గాలికొదిలేసింది. గతంలో ఈ ఉత్పత్తి మాసాలపై యాజమాన్యం దృష్టి పెట్టి సంస్థకు బొగ్గు ఉత్పత్తి మరింత పెరగడంలో విజయవంతమైనప్పటికీ ప్రస్తుతం ఆ దిశగా యాజమాన్యం ఆలోచిస్తున్నట్లు కనిపించడం లేదు. గతంలో అత్యంత కీలకంగా సింగరేణి సంస్థ 4 నెలలు ఉత్పత్తి మాసాలుగా పెట్టి కార్మికులకు ప్రోత్సాహకర బహుమతులను ఇస్తూ బొగ్గు ఉత్పత్తి పెంచి అనుకున్న లక్ష్యాన్ని చేరడంలో విజయవంతం అయ్యేది. అయితే ఈ సంవత్సరం మర్చిపోయినట్లు కనబడుతున్నది. సింగరేణిలో డిసెంబర్ నుండి ఏప్రిల్ మాసాలను యాజమాన్యం ఉత్పత్తి మాసాలుగా పరిగణించేది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమయాల్లో కార్మికులు విధులకు గైర్హాజర్ కాకుండా ఉండేందుకు సింగరేణి ప్రాంతాల్లోనే యాజమాన్యం సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం సింగరేణి ప్రాంతాల్లో ఈ జాతర ఆనవాయితీగా కొనసాగుతోంది. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం ఈ ఉత్పత్తి మాసాల్లో బొగ్గు గని కార్మికులు నెలలో 20 లేదా 22 నుండి 25 వరకు మస్టర్లు చేసి అనుకున్న లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తిలో భాగస్వామ్యులైతే వారికి ప్రోత్సాహకంగా గనుల మీద సైకిళ్లు, సూట్ కేసులు, టిఫిన్ బాక్సులు అందిస్తూ వచ్చింది. సంస్థ అందించే ప్రోత్సాహక బహుమతుల కోసం బొగ్గు గని కార్మికులు మేడారం జాతరకు బదులుగా కార్మిక ప్రాంతాల్లో యాజమాన్యం నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరలో మొక్కులు తీర్చుకొని తిరిగి వెంటనే గనుల్లో విధుల్లోకి చేరేవారు. సంస్థకు లాభాలు తెచ్చి పెట్టే విధంగా ఉత్పత్తిలో కీలకంగా మారి తాము కూడా ఉత్తమ కార్మికులుగా నిలిచేందుకు ప్రయత్నించేవారు. ఇప్పుడా పరిస్థితి సింగరేణిలో కనుమరుగైనట్లే కనిపిస్తున్నది. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టియుసిలతో పాటు గనులపై ఇతర కార్మిక సంఘాలు ఉదాసీనతగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గత సంవత్సరం కార్మికులు బొగ్గు ఉత్పత్తితో పాటు డిస్పాచ్‌లోను భాగస్వాములు కావాలని ఆదేశిస్తూ ప్రోత్సాహక ఇన్సెంటివ్‌ను ప్రకటించింది. గతంలో సింగరేణి ఆవిర్భావ వేడుకలను అట్టహాసంగా నిర్వహించిన సంస్థ . తన తప్పిదాలను గుర్తించి గనుల మీద సాదాసీదాగా వేడుకలను జరపాలన్న ఆదేశాలిచ్చింది. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలకు కలిపి కేవలం రూ 8 లక్షల నిధులు మాత్రమే ఆవిర్భావ ఏర్పాట్లకు కేటాయించినట్లు తెలుస్తుంది.ప్రతి ఏటా లాగా కాకుండా ఈసారి ఆర్థిక దుబారాను తగ్గించిన సింగరేణి యాజమాన్యం, లక్ష సాధన కొరకై ఉత్పత్తిలో భాగమవుతున్న కార్మికులకు ఇచ్చే ఇన్సెంటివ్ ఇప్పటివరకు ప్రకటించకపోవడంతో దీనికి కూడా మంగళం పాడుతుందేమోనన్న సందిగ్ధం గనుల మీద నెలకొంది. కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నామని చెప్పే గుర్తింపు కార్మిక



సంఘమైన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టియుసి ఇప్పటివరకు ఇన్సెంటివ్ పై నోరు మెదపడం లేదు.

**ఉత్పత్తి పెంపుదలలో గుర్తింపు సంఘం బాధ్యత కీలకం**

.............................

సింగరేణి కార్మికులకు ఉత్పత్తి సాధనలో గుర్తింపు కార్మిక సంఘం బాధ్యత కీలకమని చెప్పాలి. ఉత్పత్తిలో కార్మికులకు ఆ సంఘం నాయకులు వెన్నుదన్నులుగా నిలవాలి. గనుల లోకి దిగుతూ, ప్రదేశాలను సందర్శిస్తూ కార్మికులతో పాటుగా తమ పని తాము చేస్తూ యాజమాన్యంతో సంప్రదించి గనుల్లో సురక్షితమైన కొత్త లెవల్‌లు, డిప్‌లలో పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం భూగర్భంలో ఎక్కువగా ఎస్ డి ఎల్‌లు అయినప్పటికీ కొత్త పని ప్రదేశాలను కార్మికులకు చూపాలి. భూగర్భ గనుల్లో బొగ్గుఉత్పత్తికి పరిస్థితులు అందుబాటులో లేకపోతే ఉత్పత్తి సాధించే అవకాశం ఉండదు. ఉత్పత్తిలో అధికారుల పాత్ర కూడా అత్యంత కీలకంగానే భావించాలి. గతంలో లాగా ముందు జాగ్రత్తగా సర్వే ప్లానింగ్ చేపట్టి కొత్త పని ప్రదేశాలను గుర్తించి పనులను ముందుగానే చేయించుకోవాలి. జనరల్ డ్యూటీలో కాకుండా కార్మికులతో షిఫ్ట్ డ్యూటీలు నిర్వహించాలి. గనుల్లో సమస్యలను, కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుంటూ బొగ్గు ఉత్పత్తి సాధనకు చేయూతనివ్వాలి. సింగరేణిలో ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచి సరిగ్గా నేటితో రెండేళ్లు కావస్తున్న కార్మికుల సమస్యలపై స్పందించడం లేదని వస్తున్న విమర్శలకు తమ పనితీరుతో సమాధానం చెప్పాలన్న వాదనలు కార్మిక వర్గం నుండి వినిపిస్తున్నాయి. గతంలో ఉన్న నాయకులు పని ప్రదేశాలలోని కార్మికులతో కలిసిమెలిసి పనిచేస్తూ సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రతిరోజు సాయంత్రం అధికారులతో సంప్రదింపులు జరిపి సమస్యలను పరిష్కరించేవారు. కానీ నేడు షిఫ్ట్‌లలో కాకుండా జనరల్ షిఫ్ట్‌లకు నాయకులు పరిమితం కావడం వలన భూగర్భ గనుల్లో సమస్యలు పెరిగి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్న వాదనలు కార్మికుల నుండి వ్యక్తమవుతున్నాయి.

**కార్మికులకు స్పెషల్ ఇన్సెంటివ్ ప్రకటించాలి**

**(అల్లి రాజేందర్, సిఐటియు మందమర్రి బ్రాంచి సెక్రటరీ)**

.............................



బొగ్గుగని కార్మికులకు సకాలంలో అందించే ఉత్పత్తి మాసాల ఇన్సెంటివ్ యాజమాన్యం వెంటనే ప్రకటించాలి. గత రెండేళ్లుగా యాజమాన్యం కార్మికులకు ఇన్సెంటివ్ ప్రకటించకుండా ఆలస్యం చేస్తుంది. గుర్తింపు, ప్రాతినిత్య సంఘాలు డిసెంబర్‌లో ఇప్పించలేకపోయాయి. దీంతో కార్మికులు తీవ్రంగా నష్టపోయారు. డిస్పాచ్ విధానంతో సంబంధం లేకుండా గనుల్లో కష్టపడి ఉత్పత్తి సాధించిన కార్మికులకు తక్షణమే ఇన్సెంటివ్ ప్రకటించి యాజ మాన్యం కార్మికులకు అండగా నిలవాలి.

# వడ్డేపల్లిలో చీరల పంపిణీ

**హత్నూర : జనోదయ:**

వడ్డేపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ కమ్మటి స్వప్న ఆధ్వ ర్యంలో స్థానిక ఎన్నికల ముందు పంచగా మిగిలి ఉన్న బతుకమ్మ చీరలను శుక్రవారం నాడు పంపిణీ చేశారు.ఈ చీరలను తీసుకోవ డానికి మహిళలు భారీ ఎత్తున తరలివ చ్చారు.చీరలు తీసు కున్న మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు వార్డు ఉపసర్పంచ్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## కొండగట్టు ఘాట్ రోడ్డులో ఆటో ప్రమాదం

**నలుగురికి గాయాలు**

**జనోదయ, జగిత్యాల ప్రతినిధి, డిసెంబర్ 26**

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఘాట్ రోడ్డులో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం భయానక దృశ్యాలను తలపిం చింది. బ్రేక్ ఫెయిల్ అయిన ఓ ఆటో ఘాట్ రోడ్డులో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమా దంలో నలుగురు వ్యక్తులు గాయపడగా వారిని స్థానికులు తక్షణమే మల్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో మొ త్తం ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. వారు గోదావరిఖని ప్రాంతానికి చెందినవారిగా గుర్తిం చారు. కొండగట్టు దర్శనం కోసం వచ్చి తిరిగి వెళ్తుండగా, ప్రమాదం జరిగింది. ఆటో పూర్తిగా ధ్వంసమైనా, ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయటపడడం భద్రతా పరంగా శుభపరిణామంగా చెప్పవచ్చు.ప్రమాదానికి కారణం



ఆటో బ్రేక్ ఫెయిల్ కావడమేనని స్థానికులు తెలిపారు. ఘాట్‌రోడ్డులో వాహనాలు నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, ట్రాఫిక్ పోలీసులు గమనించాలన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘాట్ రోడ్డులో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే కొండగట్టు మార్గంలో భద్రతా చర్యలు కఠినంగా చేపట్టాలన్నదే ప్రజల విజ్ఞప్తి.

# అదుపులేని విమర్శలు

సీఎం రేవంత్ రెడ్డి నోటి నుంచి తీవ్రమైన భాష రావడం దురదృష్టకరం.తాజాగా కొడంగల్ వేదిక మీద నుంచి కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావుల మీద సీఎం రేవంత్ రెడ్డి వాడిన తీవ్ర పదజాలంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# అనవసర శపథాలు

## సీఎం నోటి నుంచి ఆ మాటలా?



సీఎం రేవంత్ రెడ్డి తన ప్రతిష్ఠను తనే తగ్గించుకునేవిధంగా మాట్లాడుతున్నారు. తరచూ ఆయన మాజీ సీఎం కేసీఆర్ మీద వాడుతున్న భాష పూర్తిగా అభ్యంతరకరంగా ఉంటోంది. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వాడిన భాషనే సీఎం అయిన తర్వాత కూడా కొన సాగిస్తుండటం గమనార్హం. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి నుంచి వచ్చే ప్రతీ మాటను ప్రజలు సీరియస్‌గా తీసుకుంటారు.

- బీఆర్ఎస్‌కు పడింది కామానే..
- అధికారపక్షానికి ప్రధాన ప్రత్యామ్నాయం కారే
- కారు,కమలం కలిసే ఛాన్స్?
- హామీల అమలుతోనే రేవంత్‌కు భవిష్యత్
- జనంలో చాపకింద నీరులా సర్కార్ వ్యతిరేకత
- క్షేత్రస్థాయిలో ఉన్న నిజం అదే
- అదుపులేని విమర్శలతో అనర్థమే




సీఎం రేవంత్ రెడ్డి తన ప్రతిష్ఠను తనే తగ్గించుకునే విధంగా మాట్లాడుతున్నారు.తరచూ ఆయన మాజీ సీఎం కేసీఆర్ మీద వాడుతున్న భాష పూర్తిగా అభ్యంతరకరంగా ఉంటోంది.రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వాడిన భాషనే సీఎం అయిన తర్వాత కూడా కొనసాగిస్తుండటం గమనార్హం.నాడు  కేసీఆర్ సర్కార్‌ని ఎదుర్కోవడంలో పార్టీ కార్యకర్తలను ఉత్తేజపర్చడానికి కేసీఆర్, కేటీఆర్ మీద తిట్లదండకాలను అందుకుని కాంగ్రెస్ పార్టీలో ఊపుతెచ్చారు.అప్పుడు రేవంత్ వాడిన భాష ఆమోదయోగ్యం కాకున్నా కేసీఆర్ వ్యతిరేకులు రేవంత్ భాషను అభిమానించారు.అయితే సీఎం హోదాలో ఉన్న వ్యక్తి నుంచి వచ్చే ప్రతీ మాటను ప్రజలు సీరియస్‌గా తీసుకుంటారు.మంచీచెడులను చర్చించుకుంటారు.అలాంటి సందర్భంలో సీఎం రేవంత్ రెడ్డి నోటి నుంచి తీవ్రమైన భాష రావడం దురదృష్టకరం.తాజాగా కొడంగల్ వేదిక మీద నుంచి కేసీఆర్,కేటీఆర్,హరీష్ రావుల మీద సీఎం రేవంత్ రెడ్డి వాడిన తీవ్ర పదజాలంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మటన్ కొట్టు మాటలు..బోటీ కొట్టుడు విమర్శలు పూర్తిగా సీఎం స్థాయికి తగినవికావు.

అదేవిధంగా తాను రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు కేసీఆర్ కుటుంబానికి అధికారాన్ని దక్కనీయనని ఆయన శపథం చేయడం వింత పరిణామమే.ఎందుకంటే ఒకరి రాజకీయ చరిత్రను ముగిస్తానని ఇంకొకరు చెప్పడం అవివేకమే అవుతుంది.ఏ రాజకీయ పార్టీ చరిత్ర అయినా ఏ రాజకీయ నాయకుడి ఎదుగుదలనైనా అందలం ఎక్కించేది..పాతాళానికి పడేసేది ప్రజలు మాత్రమే. బీఆర్ఎస్ పదేండ్ల పాలనకు కేవలం కామా మాత్రమే పడింది.. ఫుల్‌స్టాప్ కాదన్నది రేవంత్ రెడ్డి గ్రహించాల్సిన సూక్ష్మం.

పదేండ్ల కేసీఆర్ పాలనలో అనేక సంక్షేమ పథకాల అమలుతోపాటు అనేక అవకతవకలు,అవినీతి వ్యవహారం చోటుచేసుకున్న విషయం ముమ్మాటికీ వాస్తవమే.ఆ పార్టీ గత ఎన్నికల్లో పల్టీకొట్టడానికి కేసీఆర్,కేటీఆర్,కవితతో పాటు నాటి సిట్టింగు శాసనసభ్యుల నియంతపోకడలు, అన్యాయాలే కారణాలు.గడిచిన ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ వ్యతిరేక ప్రభంజనమే ప్రధాన అంశంగా ఉంది.బీఆర్ఎస్ పాలన మీద వ్యతిరేకత ఏర్పడితే సహజంగా రాష్ట్రంలో ప్రధాన ప్రత్యామ్నాయంగా ఉన్న పార్టీ వైపు జనాలు మొగ్గు చూపుతారు.అందుకే నాడు బీఆర్ఎస్ వ్యతిరేక ఓటర్లంతా కాంగ్రెస్ వైపు మళ్ళారు.ఇక్కడ రథసారథిగా రేవంత్ ఉన్నా లేకున్నా కాంగ్రెస్ గెలిచి ఉండేది.గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపులో రేవంత్ పాత్ర ఉండి ఉండొచ్చు..కానీ మొత్తం గెలుపు క్రెడిట్ అంతా రేవంత్ ఖాతాలోకి వేయడం అనేది అవివేకమే.స్వంత బలంతో నెగ్గగలిగే స్థాయి అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీలో అనేకమంది ఉన్నారు.అక్కడ రేవంత్ ఉన్నా లేకున్నా వారు గెలిచేవారే.అయితే కొంత ఆర్థిక తోడ్పాడుతోపాటు మరికొంత కేసీఆర్ సర్కార్‌ని ఎదుర్కోవడానికి వాడిని రేవంత్ శృతిమించిన విమర్శలు..బూతుల దండకాలు జనాలను ఆకర్శించాయి.ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం కేవలం రేవంత్ పాలనకు రెఫరెండం అనడం సరికాదు.అక్కడ కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న నవీన్‌యాదవ్ స్వంత బలంతో పాటు బీఆర్ఎస్ అభ్యర్థికి రావాల్సినంత సానుభూతి రాలేకపోవడంతోనే కాంగ్రెస్ జయకేతనం ఎగరేసింది.ఈ గెలుపును కూడా రేవంత్ ఖాతాలో వేసుకుని చూశారా.. సీఎంగా రేవంత్ బలం అనే భజనపరుల భజనల్లో మునిగిపోతే విడ్డూరంగానే ఉంటుంది.ఇక తాజాగా మూడు దశల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ సంఖ్యాపరంగా పైచేయి సాధించింది.అయితే పూర్తి ఆధిపత్యం మాత్రం కానేకాదు.ప్రతిపక్ష పార్టీలు కూడా ఘనీయంగా గ్రామాల్లో పట్టుసాధించిన విషయాన్ని మరువరాదు.చాలామంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో అధికారపార్టీకి ప్రతికూల ఫలితాలు ఎదురవడం గమనార్హం.సహజంగా స్థానిక సంస్థల ఎన్నికలు అధికార పార్టీలకే అనుకూలంగా ఉంటాయి.సంఖ్యాపరంగా పైచేయి ఉందికనుక వచ్చే ఎన్నికల్లో కూడా మాదే గెలుపు అని ప్రధాన ప్రతిపక్షమే లేదని ఆ పార్టీ భూస్థాపితం అయిందని  అనుకుంటే ఎలా? రాజకీయాల్లో నేడు ఉన్న పరిస్థితి రేపు ఉండదు.ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ముదిరితే ప్రత్యామ్నాయం వైపు ఓటర్లు పోటెత్తుతారు.

అంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ గెలవాలన్నా,కేసీఆర్ కుటుంబం అధికారానికి దూరం కావాలన్నా ఉన్న మార్గం ఒక్కటే. ఆ మార్గమే ప్రజలకు ఇచ్చిన హామీల అమలు.గడిచిన ఎన్నికల సమయంలో అనేక హామీలను కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో పెట్టిన విషయం తెల్సిందే.ఇప్పుడు రేవంత్ సర్కార్ కొలువుదీరి రెండేళ్లు పూర్తయ్యాయి.ఈ రెండేళ్ల కాలంలో ఇచ్చిన హామీలు ఎన్ని? అమలు చేస్తున్నవి ఎన్ని? అని బేరీజు వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత ఉందా? ఉంటే ఏ స్థాయిలో ఉందనే విషయాన్ని రేవంత్ క్షేత్రస్థాయిలో తెలుసుకుని ఉండాల్సిన అవసరం కూడా ఉంది.ఈ పరిశీలన చేసి ఉండి ఉంటే రేవంత్ రెడ్డి కొడంగల్‌లో కేసీఆర్ కుటుంబానికి అధికారం దక్కనీయనని,మళ్లీ కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకొని వస్తా అనే శపథాలను చేసి ఉండరు.ఎందుకంటే ప్రస్తుతం ఈ రెండేళ్ల పాలన అనంతరం ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఓటమి తథ్యం.ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది.ఎన్నో ఆశల నడుమ కొలువుదీరిని రేవంత్ ప్రభుత్వం ప్రజల ఆశలను నెరవేర్చడంలో దారుణంగా విఫలమైందనే భావన చాపకింద నీరులా ఉంది.క్షేత్రస్థాయిలో రేవంత్ రెడ్డిని సీఎంగా మెజార్టీ జనాలు అంగీకరించలేకపోతున్నారు.ఆయన భాష,హావభావాలు, అదుపులేని విమర్శలతో కావాల్సినంత వ్యతిరేకతను కొనితెచ్చుకున్నారు.ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేలల్లో మూడొంతుల మంది ఇంటిదారి పట్టే పరిస్థితే క్షేత్రస్థాయిలో ఉంది. ఉదాహరణకు ఉమ్మడి వరంగల్,కరీంనగర్,ఆదిలాబాద్ జిల్లాల్లో జిల్లాకి ఒకరో ఇద్దరో తప్ప మిగతా ప్రజాప్రతినిధులకు పరాభవం తప్పదనే పరిస్థితే ఉంది.దక్షిణ తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి ఉంది.మరి ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి అనవసర శపథాలు హద్దులు మీరిన విమర్శలు చేయడం పూర్తిగా రాజకీయ అవివేకమే.ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే ప్రజావ్యతిరేకత ఇలానే కొనసాగితే ప్రధాన ప్రత్యామ్నాయంగా ఉన్న బీఆర్ఎస్‌దే మళ్లీ అధికారం.ఇప్పటికీ పల్లెల్లో,పట్టణాల్లో బలంగా ఉన్న పార్టీ బీఆర్ఎస్సే.రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలవగలిగే సామర్థ్యం ఉన్న నేతలు బీఆర్ఎస్‌లో ఉన్నారు.అన్నింటికన్నా ముఖ్యంగా కేసీఆర్ అనే బలమైన నాయకత్వ రూపం బీఆర్ఎస్ పార్టీకి పెద్ద వరం.ఇదిలా ఉంటే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది మేమే అని బీజేపీ నేతలు ఎన్ని చెప్పినా కమలనాథులకు రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు.మెజార్టీ ఓటర్లున్న గ్రామీణంలో పార్టీకి పట్టులేనప్పుడు ఇక అధికారం మాదే అని చెప్పడం పూర్తి అసత్యమే అని అనుకోవాలి.ఈ విషయం బీజేపీ నాయకత్వానికి కూడా తెలుసు.అయితే వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ,బీఆర్ఎస్ పార్టీల నడుమ పొత్తు ఉండే అవకాశం నూటికి తొంభై శాతం ఉంది.ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణలో కూడా బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంటునే అవకాశం మెండుగా ఉంది.బీఆర్ఎస్‌కూడా మైనార్టీ ఓటర్లను దృష్టిలో ఉంచుకుని బీజేపీని అంటరాని పార్టీకి చూసే పరిస్థితి ఇప్పుడు లేదు.మైనార్టీలే బీజేపీకి పెద్ద ఎత్తున ఓట్లు వేస్తున్నప్పుడు ఇక పొత్తు విషయంలో బీజేపీని అంటరాని పార్టీకి చూడటం ఎందుకనే ప్రశ్న ఆ పార్టీ నేతల నుంచే వ్యక్తమవుతోంది.ఒకవేళ తెలంగాణలో బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు కనుక పొత్తు పెట్టుకునే పక్షంలో సీఎం పీఠం బీఆర్ఎస్,డిప్యూటీ సీఎం కుర్చీ బీజేపీకి దక్కేవిధంగానే పొత్తులుంటాయి.ఈ పొత్తుగనుకు కుదిరేపక్షంలో ఇరుపక్షాలకు ఉపయుక్తంగానే ఉంటుందనే అభిప్రాయం ఇరుపార్టీల్లో ఉంది.కేసులు,అధికార కాంగ్రెస్‌ని ఎదుర్కోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కోవాలంటే బీజేపీతో జతకట్టడమే బీఆర్ఎస్‌కు మేలు.అలాగే సరియైన క్యాడర్‌లేదు..పల్లెల్లో పట్టులేదు.అధికారంలోకి రావడానికి కావాల్సినంత స్వంత బలం లేదు కావున బీఆర్ఎస్‌తో జతకడితే కనీసం అధికారాన్నైనా పంచుకునే అవకాశం దక్కుతుందనే ఆలోచన బీజేపీ నేతల్లో ఉంది. కాంగ్రెస్‌తో ఎలాగూ బీజేపీ జతకట్టలేదు కావున ఉన్న ప్రత్యామ్నాయం బీఆర్ఎస్.అందుకే కారు,కమలం జతకట్టే రాజకీయ అనివార్యత రాష్ట్రంలో ఏర్పడక తప్పదు. మరి ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు అధికారం దక్కనీయనని రేవంత్ రెడ్డి చేస్తున్న శపథాలు ఏమేర ఫలిస్తాయో తెలియదు.అయితే ఒక్కటి మాత్రం నిజం...బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అండ్ ఫ్యామిలీ మీద రేవంత్‌కు కావాల్సినంత కసి ఉన్నది.తనని జైలుపాలు చేసిన ఆ కుటుంబానికి అధికారం దక్కనీయననే శపథం మొదటి నుంచి చేస్తూ వస్తున్నారు.తన పార్టీ ఏమైనా పర్వాలేదు.. రాజకీయంగా తను నష్టపోయినా పర్వాలేదు..కానీ కేసీఆర్ అనే మొక్కను ఈ గడ్డమీద మొలకెత్తనీయను అనే శపథం రేవంత్ చాలారోజులుగా బహిరంగంగానే చేస్తూ వస్తుండటం గమనార్హం.ఇందుకు అనుగుణంగానే రేవంత్ రెడ్డి బీజేపీ నేతలతో సఖ్యతగా ఉంటున్నారే ప్రచారం ఉంది. పరోక్షంగా కమల వికాసానికి రేవంత్ దారులు వేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.ఇందులో నిజానిజాల సంగతి ఎట్లున్నా బీజేపీతో బీఆర్ఎస్‌ని కలవనీయకుండా రేవంత్ తనకు తెల్సిన అన్ని రాజకీయాలను ఉపయోగించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.ఏపీ సీఎం చంద్రబాబు మధ్యవర్తిత్వంలో బీజేపీతో సఖ్యత దారులను వేసుకుని భవిష్యత్‌లో బీఆర్ఎస్‌ని దెబ్బతీయాలనే లక్ష్యంతో రేవంత్ రాజకీయం చేస్తున్నారనే ఆరోపణలుకూడా ఉన్నాయి.ఇందులో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా.. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అని రాష్ట్రంలో కమలం బలాన్ని కృత్రిమంగా పెంచాలనే ఎత్తుగడ వేసినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని పలువురు అంటున్నారు.ఈ నమ్మకంతోనే మళ్ళీ కేసీఆర్ కుటుంబానికి అధికారం దక్కనీయను..ఇదే నా శపథం అంటూ సీఎం రేవంత్ గట్టిగా శపథం చేస్తున్నారనే అనుమానం కూడా ఉంది.అయితే సీఎం రేవంత్ రెడ్డి అనుకున్నట్లు బీజేపీ రాజకీయాలు ఉండకపోవచ్చు.రాష్ట్రాల్లో రెండు ప్రత్యర్థి పార్టీలతో లోపాయికారీ ఒప్పందాలు నెరుపుతూ రెండు పార్టీలను ఒకరిమీద ఒకర్ని ఉసిగొల్పుతూ అధికారాన్ని పంచుకోవడం అనే కమలనాథుల రాజకీయంలో ఎవరైనా పావులుగా మిగిలిపోవాల్సిందే.ఇందుకు రేవంత్ రెడ్డి  చంద్రబాబు ,వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి,కేసీఆర్‌లు మినహాయింపేమీ కాదు.అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే మళ్ళీ అధికారంలోకి రావాలని కోరుకోవడంలో నూటికి నూరుశాతం అర్థం ఉంటుంది..అంతే తప్ప కేసీఆర్‌నో ఇంకొకరినో అధికారంలోకి రాకుండా చేస్తా అని శపథాలు చేయడం తగదు.ప్రజలకు ఇచ్చిన హామీలను నూటికి తొంభైశాతం అమలు చేసి పాలనను గాడిలో పెట్టి ప్రజలకు వాస్తవాలను నిజాయితీగా వివరిస్తే ఖచ్చితంగా మంచి ఫలితాలే ఉంటాయి.ప్రత్యర్థిని తగ్గించాలని నోటికి పదును పెట్టి అదుపులేని మటన్ కొట్టు మాటలు..బోటీ కూర విమర్శలు చేస్తే జనాల్లో సీఎం కుర్చీ పలచనవడంత తప్పమరొకటి కాదు.ఒక సీఎం నోటి నుంచి వచ్చే ప్రతీ మాట హుందాతనానికి నిలువెత్తు నిదర్శనంగా ఉండాలి.సీఎం చెప్పారంటే అందులో నిజం ఉందని జనాలు విశ్వసించాలి.అప్పుడే ప్రజల్లో గౌరవం ఇనుమడిస్తుంది.విషయం లేనప్పుడే శబ్దం ఎక్కువగా ఉంటుందంటారు.ఇప్పుడు ప్రభుత్వంలో పసలేదుకాబట్టే సీఎం రేవంత్ నోటి నుంచి సౌండ్ ఎక్కువగా వస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.మైకు దొరికితే తనని తను మర్చిపోవడం అనే వీక్‌నెస్ రేవంత్‌కు ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారంలో నిజం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు రేవంత్ మీదనే ఉంది.చూడాలి మరి సీఎం రేవంత్‌లో మార్పు వస్తుందో లేదో.

..........................................................

**మానసాని కృష్ణా రెడ్డి**
**9618616110**
**8074124190**

# స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

**ప్లాంట్ యాజమాన్యాన్ని కోరిన సర్పంచ్**

**జనోదయ , జైపూర్ ,డిసెంబర్ 26**



మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రం ఎస్టిపిపిలో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించి,ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను బలపరచాలని ఎస్టిపిపి యాజమాన్యాన్ని పెగడపల్లి సర్పంచ్ రామగిరి రాము కోరారు.శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి సర్పంచ్ రాము ఎస్టిపిపి ఈడి చెన్నకేశవుల చిరంజీవిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని,ప్లాంట్ ప్రభావిత గ్రామమైన పెగడపల్లిలో మౌలిక వసతులు కల్పించాలని, ప్లాంట్ అధికారులను కోరినామని తెలిపారు.దీనిపై ప్లాంట్ ఈడి సానుకూలంగా స్పందించారని చెప్పారు.స్థానికులకు ప్రాధాన్యత నిచ్చే విధానాలను పటిష్టంగా అమలు చేసేలా స్థానిక సర్పంచ్‌గా కృషి చేస్తానని పేర్కొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్లాంటులో స్థానికులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఉపాధి అవకాశాలు మెరుగు పడేందుకు పాటు పడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ గౌడ్, మల్ల గౌడ్, అంజిరెడ్డి, ప్రభాకర్, మల్లారెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలకు వందశాతం కట్టుబడి ఉంటా

**నేను రాజీనామా చేయాలా వద్దా అనేది నియోజకవర్గ ప్రజలే నిర్ణయిస్తారు**

**మరో మూడు సంవత్సరాల్లో ఇచ్చిన అభివృద్ధి హామీలు అమలు చేయకపోతే రాజీనామాకు సిద్ధం**

**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జనోదయ, ఉమ్మడి కరీంనగర్ బ్యూరో**



ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీలకు నూటికి నూరు శాతం కట్టుబడి ఉన్నానని చిన్న హామీ మేరకు మరో మూడు సంవత్సరాలల్లో అమలు చేస్తానని లేదంటే రాజీనామాకు సిద్ధమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథిగృహంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో కలిసి పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నా నియోజకవర్గం పూర్తిగా రైతు ఆధారిత ప్రాంతమని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతో కరీంనగర్‌లో ఈ ప్రెస్ మీట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.2016లో జీవో నం.71 ప్రకారం ప్రారంభించిన ప్రాజెక్టును 2022 వరకు పూర్తి చేయలేదని, అంచనాలను రూ. 136 కోట్లకు పెంచారని విమర్శించారు.ఎలాంటి అనుమతులు లేకుండా అప్పటి కాంట్రాక్టర్‌తో చీకటి ఒప్పందాలు చేసి పనులు ప్రారంభించారని ఆరోపించారు.కాళేశ్వరం లింక్-2 పేరుతో 1,020 ఎకరాల భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని, ధర్మపురి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని నాటి సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనలు అమలుకాలేదన్నారు. అప్పటి మంత్రులు 146 గ్రామాలకు సాగునీటి గురించి ఒక్కసారి కూడా ప్రశ్నించలేదని తెలిపారు.కాళేశ్వరం పేరుతో ఒడ్డెర జాతి ప్రజలను పోలీసులతో బెదిరించి గుట్టను ఖాళీ చేయించారని, భూములు ఇవ్వకపోతే కేసులు పెడతామని రైతులను బెదిరించారని ఆరోపించారు. ప్రజలను మోసం చేయడం తనకు తెలియదని, నిజాలు మాత్రమే మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు.తాను కేవలం ఆరు నెలలుగా మంత్రిగా ఉన్నప్పటికీ, 80 మంది విద్యార్థులను పోలాస అగ్రికల్చర్ కాలేజీకి పంపించి రూ.7 కోట్ల బకాయిలను ముఖ్యమంత్రి నాయకత్వంలో చెల్లించామని తెలిపారు.జిల్లాకు చెందిన ఎస్సీ మంత్రిగా దళిత బిడ్డలను గత పాలకులు విస్మరించారని విమర్శించారు. తన రాజీనామాపై మాట్లాడే వారికి సమాధానంగా "నేను రాజీనామా చేయాలా వద్దా అనేది ధర్మపురి నియోజకవర్గ ప్రజలే నిర్ణయిస్తారు" అని స్పష్టం చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు నూటికి నూరు శాతం కట్టుబడి ఉంటానని తెలిపారు.గత ప్రభుత్వ అప్పుల వల్ల రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో పడిందని, ప్రస్తుతం మా పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు.ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి కోసం పాలిటెక్నిక్ కళాశాల, రెవెన్యూ డివిజన్, బస్ డిపో తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ట్రైబల్ మినిస్టర్ ద్వారా రూ.60 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువచ్చామని, వాడ-వాడ అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించామని తెలిపారు.మరో మూడు సంవత్సరాల్లో తాను ఇచ్చిన అభివృద్ధి హామీలు అమలు చేయకపోతే రాజీనామా చేయడానికి సిద్ధమని స్పష్టమైన సవాల్ విసిరారు. మూడు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి ఆధారంగానే ప్రజల ముందుకు వెళ్లి ఓటు అడుగుతానన్నారు.జనవరి చివరి వారం వరకు గోదావరి పుష్కరాలకు సంబంధించి స్పష్టమైన ప్రణాళికతో నిధులు వెచ్చించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలిపారు.తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ధర్మపురికి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని విమర్శించారు.

# బెల్లంపల్లిలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 26:**

బెల్లంపల్లి మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంసి క్రికెట్ మైదానంలో శుక్రవారం నాడు ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నమెంటును బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు చెడుమార్గంలో పయనించకుండా ఉండడానికి ఇలాంటి క్రికెట్ టోర్న మెంట్లు అవసరమన్నారు. క్రీడల్లో మంచి నైపుణ్యాన్ని సాధించి పేరు సంపాదించాలన్నారు. ఈ లీగ్ టోర్నమెంట్‌ను మూడు విభాగాలుగా ఏబిసి పేరుతో విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, కాంగ్రెస్ బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య, సీనియర్ క్రికెటర్ ఈగ వెంకటస్వామి అకాడమీ ఇన్చార్జ్ అల్లం వెంకటేశ్వర్లు కోచ్ జాడి శేఖర్, సీనియర్ క్రికెటర్లు బూదే సత్తి, గీస రాములు, జి శ్రీనివాస్ చారి, అల్లం గౌతం పి ఈ టి హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోతులకు పండ్లు అందించిన ఆర్ 9 న్యూస్



**జనోదయ,పెద్దపల్లి , డిసెంబర్ 26:**

మంథనిలో కోతుల బెడద నివారణ చర్యలలో భాగంగా పట్టబడిన కోతులు ఆహారం లేక ఇబ్బంది పడుతున్నాయని గమనించిన సందర్భంలో మానవత్వం చాటుకునే ఘటన చోటు చేసుకుంది. సుమారు ఐదు గంటలుగా కోతులకు ఆహారం అందకపోవడంతో పరిస్థితిని గుర్తించిన ఆర్ 9 న్యూస్ సీఈఓ తూర్పు రమేష్ స్వయంగా స్పందించి కోతులకు అరటి, ఆపిల్ పండ్లను ఆహారంగా అందించారు. సమస్య పరిష్కార చర్యల మధ్య కూడా జీవుల పట్ల దయ, బాధ్యత చూపిన ఈ సహాయం స్థానికుల్లో ప్రశంసలు అందుకుంటూ మానవత్వానికి నిదర్శనంగా నిలిచింది.




## సమ్మక్క సారలమ్మ జాతరను

# వైభవంగా నిర్వహించాలి

### సింగరేణి ఏరియా జీఎం రాధాకృష్ణ




**జనోదయ మందమర్రి డిసెంబర్ 26:**

పట్టణంలోని ఆర్కే1ఎ గని సమీపంలోని పాలవాగు ఒడ్డు అటవీ ప్రాంతంలో నిర్వహించనున్న సమ్మక్క సారమ్మ జాతరను వైభవంగా నిర్వహించాలని సింగరేణి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ కోరారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్లో జాతర ఏర్పాట్లపై ఏరియా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 28 నుండి 31వ తేదీ వరకు నిర్వహించే సమ్మక్క సారక్క జాతరను రంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర ప్రాంగణంలో చేపట్టనున్న పనుల గురించి అధికారులు సమీక్షించుకోవాలని సూచించారు. సమ్మక్క సారక్క గద్దెల వద్ద చేపట్టాల్సిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. జాతరలో తాత్కాలిక మరుగుదొడ్లు, మంచి నీటి వసతి, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు భక్తులు వెళ్లేందుకు వీలుగా తాత్కాలిక రోడ్లను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మేడారం జాతరను తలపించే విధంగా ఏర్పాట్లు ఉండాలని, యూనియన్ ప్రతినిధులు జాతర విజయవంతం చేసేందుకు తగిన సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పార్టీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూ శంకరయ్య, కేకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మల్లయ్య, డీజీఎం ఈ అండ్ఎం వర్క్ షాప్ దూప్ సింగ్, ఇన్చార్జి పర్సనల్ మేనేజర్ ఎండి ఆసిఫ్, సివిల్ ఎస్ఇ శ్రీధర్, ఏరియా సర్వే ఆఫీసర్ దేశాయ్, ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణా పూర్ బ్రాంచ్ సెక్ర టరీ అక్బర్ అలీ, వైస్ ప్రెసిడెంట్ భీమ నాదుని సుదర్శన్, జీఎం ఆఫీస్ స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి రమణ, ఏరియా ఉన్నతాధికారులు, అన్ని గనుల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# నిలువెత్తు మొక్కులు



**జనోదయ, బెల్లంపల్లి, డిసెంబర్ 26:**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మేడారంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో సమ్మక్క, సారాలమ్మ జాతర జరగనుండడంతో సింగరేణి ప్రాంతమైన బెల్లంపల్లిలో నిలువెత్తు బంగారం (బెల్లం) మొక్కులు మొదలయ్యాయి. కుటుంబాలతో తరలివెళ్లి మేడారంలో దర్శనం మొక్కులు తీర్చుకోనున్న భక్తులు శుక్రవారం బెల్లంపల్లిలో నిలువెత్తు బంగారం (బెల్లం) కొనుగోలుకు పోటీపడ్డారు. బెల్లం కొనుగోళ్లతో పట్టణంలోని పలు దుకాణాల వద్ద సందడి కనిపించింది.

## భీమారంలో నట్టల మందుల పంపిణీ




**జనోదయ: ఉమ్మడి ఆదిలాబాద్**

భీమారం మండలం ఖాజీపల్లె గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల మేకలు పాడి పశువుల నట్టల మందు కార్యక్రమాన్ని భీమారం మండల పశువైద్యాధికారి రాకేష్ శర్మ అధ్యక్షతన ఖాజీపల్లె గ్రామంలో గొర్రెల మేకల కాపరులకు నా ట్టల మందుల కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ కొండ శ్యామల చందు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ లు పశువులకు నట్టల మందులు పంపిణీ చేశారు అనంతరం డాక్టర్ రాకేష్ శర్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువుల కాపరులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది నరసింహులు, సంపతి రమేష్ , ఎగ్గే చంద్రశేఖర్, గుట్టన్న, బీరేష్ మల్లేష్ ,కటికల బీరేష్ ,పర్వతాలు,దయ్యాల స్వామి, జంగిటి రవితేజ, రాజయ్య ,ముదిగిరి బానేష్,కోరే బాపు, ఐలయ్య, కొమ్ము కుమార్,వీరేష్,గణపతి,ఎ. తిరుపతి, కిట్టయ్య పాల్గొన్నారు.

## సిరాల ప్రాజెక్టు ద్వారా

# 600 ఎకరాలకు సాగు నీరు అందిస్తాం



### సాగునీటి విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే రామారావు పటేల్

**జనోదయ,భైంసా,డిసెంబర్ 26:**

సిరాల ప్రాజెక్టు ద్వారా 600 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం సిరాల ప్రాజెక్టు కాలువ ద్వారా రబీ పంటకు సాగునీటిని విడుదల చేసిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు.భారీ వర్షాలకు గత రెండు సంవత్సరాల క్రితం ప్రాజెక్టు కట్ట తెగిపోతే ప్రభుత్వానికి ఒప్పించి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 12 కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన సాగునీటి శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. నిధులు మంజూరైన ఏడాది కాలంలోనే కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయడానికి ఆయన అభినందించారు.ముథోల్ నియోజకవర్గంలో రైతన్నకి సాగునీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, పంటలు సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానన్నారు.ఈ క్రమంలోనే చెరువుల నిర్మాణానికి,లిఫ్టుల పునః ప్రారంభానికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ అనిల్ కుమార్, సిరాల సర్పంచ్, ఈలేగాం సర్పంచ్ సీరం రాజమణి, దేగాం సర్పంచ్ సుష్మా రెడ్డి, ఇలేగాం ఎంపిటిసి,బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే

# లక్ష్యంగా జైపూర్ సర్పంచ్

**జనోదయ, జైపూర్, డిసెంబర్ 26**




మంచిర్యాల జిల్లా జైపూర్ గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీలో చెత్త చేరి మురికి నీరు నిల్వవుంది అని తెలియగానే వెనువెంటనే దానిని పరిశుభ్రంగా చెయ్యడానికి జేసీబీతో క్లియర్ చేశారు. ఇందిరమ్మ కాలనీ నుండి పోలీస్ స్టేషన్ వరకు చెత్త,నీటి పారుదల వ్యవస్థను సక్రమం గా ఉంచాలి అనే లక్ష్యంగా శుభ్రం చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంబల్ల సంపత్ రెడ్డి, సర్పంచ్ కూన భాస్కర్ ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ కాంగ్రెస్ నాయకులు మనుబోతుల సమ్మయ్య బీస్యూలా రవి పళ్ళ రాజు అంబల్ల రవి అరిగేలా శ్రీనివాస్ మంతెన లక్ష్మణ్ ఇరిగిరాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందారం ఓపెన్ కాస్ట్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

**సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహా రావు**

**జనోదయ మందమర్రి డిసెంబర్ 26:**

ఇందారం ఓపెన్ కాస్ట్‌లో ఓవర్ బర్డెన్ కాంట్రాక్టర్ అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెబిసిసిఐ సభ్యులు మంద నరసింహా రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందారం ఓసీపీలో ఓబి వెలికి తీత పనుల్లో జరిగిన అవినీతికి ఆస్కారమిచ్చిన అధికారులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సింగరేణి ఉన్నతాధికారుల సహకారంతో కాంట్రాక్టర్ కు విధించిన పెనాల్టీని మాఫీ చేయించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చిన అంశంపై సిబిఐ విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సింగరేణి సంస్థలో గతంలో అనేక అవకతవకలు జరిగాయని, ముఖ్యంగా డీజిల్, గ్రేడ్, లీడు, బొగ్గు, ఇసుక, పర్చేజ్ వంటి విభాగాల్లో అనేక కుంభకోణాలు జరిగినప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసు కోకుండా కిందిస్థాయి అధికారులపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని కుంభకోణాలను బుట్ట దాఖలు చేసిన చరిత్ర సింగరేణి సంస్థకి ఉందని ఆయన యజమాన్యం తీరుపై తీవ్ర అగ్రహాం వ్యక్తం చేశారు. అనేక విజిలెన్స్ కేసులలో బయటపడ్డ వాటిని కనుమరుగు చేసిన చరిత్ర కూడా ఉన్నతాధికారులకు ఉన్నదని ఆయన మండి పడ్డారు. ఇప్పటికైనా గత పది సం,,గా సింగరేణిలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి సింగరేణిని పరిరక్షించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణిలో ఇప్పటికే కొత్త బొగ్గు బ్లాకులు రాక పోగా, బొగ్గు కరెంటు బకాయిలు పేరుకు పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో, కుంభకోణాల పేరుతో కంపెనీ



డబ్బులు అక్రమ మార్గంగా లూటీ చేయటం వల్ల సింగరేణి సంస్థ మనుగడకే ప్రమాదకరంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి ఇందారం ఓసిపి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి కుంభకోణంలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని సింగరేణి సంస్థను పరిర క్షించాలని కోరారు.

# రైతులకు అండగా ప్రభుత్వం



**లక్షెట్టిపేట,జనోదయ డిసెంబర్ 26:** రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం లక్షెట్టిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సీఎం,డిప్యూటీ సీఎం,మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు చిత్ర పటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని మోదేలలో మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంజూరు చేపించడం చరిత్రలో నిలిచిపోతోందన్నారు. రైతుల ఎన్నో ఏండ్ల కలను నెరవేర్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. రైతులకు ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా న్యాయం చేసేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమేనని వివరించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేల ప్రేమ్ సాగర్ రావు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టిఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్,పట్టణ అధ్యక్షుడు ఎండి ఆరిఫ్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం,డీసీసీ అధికార ప్రతినిది పూర్ణచందర్ రావు, నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు,రైతులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# నేతకాని కులస్తుల ఐక్యతతోనే హక్కుల సాధన

**జనోదయ, ఉమ్మడి ఆదిలాబాద్ :** జన్నారం మండలంలోని నేతకాని కులస్తులంతా ఐక్యంగా ఉన్నప్పుడే తమకు రావాల్సిన హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత పిలుపునిచ్చారు. జన్నారం మండల కేంద్రంలోని భరత్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఎస్.పి.ఎన్ హోటల్‌లో నిర్వహించిన నేతకాని సమ్మేళన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో దాదాపు పదివేలకు పైగా నేతకాని కులస్తులు ఉన్నారని, ఇంతటి భారీ సంఖ్యలో ఉన్న మనం సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తుచేశారు. ఈ సం దర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నేతకాని



కులం నుండి గెలు పొందిన సర్పంచ్ లు, ఉప సర్పంచ్‌లు మరియు వార్డు సభ్యులు తమ గ్రామాల అభివృద్ధికి చిత్త శుద్ధితో కృషి చేయాలి. ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి, వారి అభ్యు న్నతికి నేతకాని మహర్ విద్యార్థి సం ఘం ఎల్లవేళలా వెన్నంటి ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యా, ఉద్యోగ మరి యు రాజకీయ రంగాల్లో కులస్తులు ఎదగాలంటే ఐక్యమత్యమే మహాబలమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి కుల బాంధవులు, విద్యార్థులు మరియు సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమ సమస్యలను చర్చించుకోవడంతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలపై దిశానిర్దేశం చేసుకున్నారు.

# ఘనంగా ఉద్ధంసింగ్ జయంతి



**జనోదయ, మందమర్రి, డిసెంబర్ 26:** భారత స్వాతంత్ర సమర యోధులు ఉద్ధం సింగ్ జయంతి వేడుకలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన మాజీ ఆర్మీ జవాన్ సింగరేణి ఎస్ అండ్ పిసి ఉద్యోగి రాజేష్ కుమార్ పివ్వాల్ – రాణి పివ్వాల్ దంపతులు శుక్రవారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్ధం సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె పురుషోత్తం హాజరై మాట్లాడారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులు బాసిన సమర యోధులను స్మరిస్తూ వారి జయంతి వర్ధంతి లను నిర్వహించడం అభినందనీయమన్నారు. జలియన్ వాలా బాగ్ మారణ కాండలో ప్రాణాలతో బయట పడిన ఉద్ధంసింగ్ తాను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి, ఏళ్ళ తరబడి నిరీక్షించి, లక్ష్య సాధన కోసం విదేశానికి వెళ్ళి, సమయం చూసి నరరూప రాక్షసుడైన డయ్యర్‌ను హతమార్చి, ఉరి తాడును ముద్దాడిన దేశం గర్వించదగ్గ అమరుడు ఉద్ధమ్ సింగ్ అని ఆయన సేవలను కొనియాడారు. దేశం కోసం, దేశ స్వతంత్రం కోసం సాహసోపేతంగా పోరాటాలు చేసిన స్వతంత్ర సమర యోధులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల పాఠశాల ఉపాధ్యాయులు ఎం జీవన్, ప్రముఖ వ్యాపారి ఆగుళ్ల తిరుమలేశ్ లు పాల్గొన్నారు.

# గొల్లమాడ గ్రామ అభివృద్ధి పనులకు 20 లక్షల రూపాయలు మంజూరు

**మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి**

**జనోదయ,భైంసా,డిసెంబర్ 26:**

నర్సాపూర్ (జీ) మండలంలోని గొల్లమడ గ్రామ మహిళ సంఘ భవన నిర్మాణం కోసం రూ. 10 లక్షలు, ఉన్నత పాఠశాల గోడ నిర్మాణం కోసం రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు నిర్మాణ పనులకు సంబంధించిన అధికారిక జారీ పత్రాలను ముథోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆయన సందర్భంగా వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభివృద్ధి పనులకై 20 లక్షల రూపాయలు మంజూరు చేసిన మంత్రి వర్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, ముథోల్ మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి గ్రామం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,వీడిసి మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచ్‌లను సత్కరించిన ఎమ్మెల్యే



జనోదయ, గోదావరిఖని, డిసెంబర్ 26: రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబెర్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మేజర్ గ్రామపంచాయతీలకు రూ.10 లక్షలు చిన్న గ్రామ పంచాయతీలకు ఐదు లక్షల నిధులను సీఎం రేవంత్ రెడ్డి నిధుల నుంచి నేరుగా సర్పంచ్లకు అందజేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో కొత్తగా ఎన్నుకోబడిన గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రజలతో మమేకమై గ్రామ అభివృద్ధికి దోహదపడాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అంతర్గాం పాలకుర్తి మండలంలోని వివిధ గ్రామాల గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు ఆత్మీయంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రజా పాలన నేపథ్యంలో ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు అందించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. ఈ నేపథ్యం లోనే రైతులకు సాగు, తాగు నీరు అందించడంతోపాటు సకాలంలో పంట పండించేందుకు తగిన సహకారం అందిస్తున్నామన్నారు. అదేవిధంగా పంట దిగుబడికి సంబంధించి గిట్టుబాటు ధరను రైతులకు అందించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులను సంపన్నులుగా చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టిందన్నారు. సన్న చిన్న కారు రైతులను సర్కారు అన్ని విధాలుగా ఆదుకుంటుందని పేర్కొన్నారు. గ్రామాలలో అభివృద్ధి సాధిస్తేనే దేశం అభివృద్ధి సాధిస్తుందనే ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలపై ముందుగా అభివృద్ధి చేస్తున్నామ న్నారు. అదే క్రమంలో కొత్తగా ఏర్పాటైన పాలకులు ప్రజా సంక్షేమంతో పాటు గ్రా మాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పని చేయాలన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలు లేని పల్లె లుగా తీర్చిదిద్ది ఆదర్శ గ్రామాలుగా రూపుది ద్దాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వివిధ విభగల అధ్యక్షులు పాల్గొన్నారు

## జీ రామ్ జీపై కాంగ్రెస్ జంగ్‌సైరన్

### దేశవ్యాప్త పోరుకు సిద్ధమైన హస్తం పార్టీ

న్యూఢిల్లీ, డిసెంబరు 26: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరును మార్చడంతో పాటు ఆ పథకంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులపై దేశ వ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ నేపథ్యంలో నేడు న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించనుంది. పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించి, దానిని 'జీ రామ్ జీ'గా మార్చడం వెనుక ఉన్న రాజకీయ కుట్రను ప్రజలకు వివరించడమే కాకుండా, రాష్ట్రాలపై కేంద్రం మోపుతున్న అదనపు ఆర్థిక భారంపై అవగాహన కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు శుక్రవారం రాత్రే సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఢిల్లీకి చేరుకున్నారు. అలాగే, తెలంగాణ నుంచి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు సమావేశంలో పాల్గొననున్నారు. సీఎం వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఉన్నారు.

# 20 మంది వీర బాలలకు పురస్కారాల ప్రదానం

**బహూకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
**అవార్డులు అందుకున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విశ్వనాథ్, శివాని**





న్యూఢిల్లీ, డిసెంబరు 26 : వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పిల్లల కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లను బహూకరించారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవలు, పర్యావరణం, క్రీడలు, కళలు-సంస్కృతి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అసాధారణ విజయాలను సాధించినందుకు వీటిని అందజేశారు. వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకొని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలకు వీటిని ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పర్వతారోహకుడు విశ్వనాథ్ కార్తికేయ్, ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన 17 ఏళ్ల పారా అథ్లెట్ క్రీడాకారిణి శివాని హొసూరు ఉప్పర ఉన్నారు. రికార్డులు సృష్టిస్తున్న క్రికెట్ క్రీడాకారుడు వైభవ్ సూర్యవంశీ కూడా పురస్కారం అందుకున్నాడు. తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పడకంటి విశ్వనాథ్ కార్తికేయ్ పర్వతారోహకుడు. ఈ ఏడాది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా 'సెవెన్ సమ్మిట్స్' ఛాలెంజ్‌ను పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడైన భారతీయుడిగా నిలిచాడు. విశ్వనాథ్ పేరిట నాలుగు ప్రపంచ రికార్డులు ఉన్నాయి. అందులో ఎల్‌బ్రూస్ పర్వతాన్ని కేవలం 24 గంటల్లోనే ధిరోహించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు కూడా ఒకటి. విశ్వనాథ్ ఆరు ఖండాల్లోని 20కి పైగా పర్వతాలను అధిరోహించాడు.దివ్యాంగురాలైన ఏపీకి చెందిన 17 ఏళ్ల శివాని థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్(2023) అండర్ 20 విభాగంలో జావెలిన్ ఎఫ్45, షాట్‌పుట్ క్రీడల్లో విజేతగా నిలిచింది. గతేడాది బెంగళూరులో నిర్వహించిన నేషనల్ జూనియర్ అండ్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ అండర్ 17 విభాగంలో 100 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో, షాట్ పుట్‌లో మూడు బంగారు పతకాలను గెలిచింది. 12వ నేషనల్ ఛాంపియన్‌షిప్స్(2023) మహిళల జావెలిన్ త్రోలో రజత పతకం సాధించింది.ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశానికి తన వంతు సేవలు అందించి సైనికుల ప్రశంసలు అందుకున్న ఓ పదేళ్ల బాలుడు ఇప్పుడు రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నాడు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా చక్ తరన్ వాలీ గ్రామానికి చెందిన శ్రావణ్ సింగ్.. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు నీరు, పాలు, టీ, లస్సీ అందజేశాడు. బాలుడి దేశభక్తిని చూసి సైనికులు మురిసిపోయారు. 'యంగెస్ట్ సివిల్ వారియర్' పేరుతో సన్మానించారు. జెన్-జీపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, వారి సామర్థ్యాలు, క్రమశిక్షణ, కష్టపడే తత్వం వికసిత్ భారత్ కలను సాకారం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన 'వీర్ బాల్ దివస్' కార్యక్రమంలో మోదీ పాల్గొని మాట్లాడారు. యువత కలలు, ఆకాంక్షలే దేశ దశ, దిశను నిర్ణయిస్తాయని అభిప్రాయపడ్డారు. యువత స్వల్పకాలిక ఆకర్షణల మోజులో పడకుండా లక్ష్యం వైపు దూసుకెళ్లాలని సూచించారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక యువతకు ఎన్నో రంగాల్లో అవకాశాలను కల్పించామని ఆయన చెప్పుకొచ్చారు. ఎవరు పెద్ద.. ఎవరు చిన్న అనేది వయసు నిర్ణయించదని, చేసే పనులు సాధించే విజయాలే నిర్ణయిస్తామన్నారు.

# కొండగట్టు అంజన్న ఆలయ భూవివాదం

## 500 ఏళ్ల కొండగట్టుకు 200 ఏళ్ల చట్టాలా?

### న్యాయం, చట్టం, విశ్వాసాల మధ్య చిక్కుకున్న ప్రశ్నలు !!



కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం...
తెలంగాణ భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన పేరు. శతాబ్దాలుగా అరణ్య నడుమ వెలసిన ఈ స్వయంభూ క్షేత్రం, ఇప్పుడు అటవీ శాఖ-దేవాదాయ శాఖల మధ్య చట్టపరమైన వివాదానికి కేంద్రంగా మారింది. అటవీ శాఖ జారీ చేసిన షోకాజ్ నోటీసులు ఒక్కసారిగా భక్తుల్లో కలవరాన్ని, ప్రజల్లో అనేక సందేహాలను రేకెత్తించాయి.
ఇది కేవలం ఆరు ఎకరాల భూమి వివాదం మాత్రమే కాదు.
ఇది చట్టాల అమలు విధానం, ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం, శతాబ్దాల విశ్వాసాల పరిరక్షణ - అన్నింటినీ తాకే అత్యంత సున్నితమైన అంశంగా మారింది.

**కొండగట్టు ఆలయం – చరిత్ర అటవీ శాఖకంటే పాతది**
చరిత్రను తిరగేస్తే, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయానికి కనీసం 500-600 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్నట్లు పురాణాలు, స్థానిక కథనాలు, ఆలయ సంప్రదాయాలు స్పష్టం చేస్తున్నాయి.
విజయనగర సామ్రాజ్య కాలానికి ముందే ఈ ఆలయం ప్రజల పూజా



బేతాళ స్వామి ఆలాయానికి వెనకాల అల్లు బండకి సర్వే చేసి వేసిన మార్క్

కేంద్రంగా ఉందని నమ్మకం.
అటవీ శాఖ వ్యవస్థ మాత్రం బ్రిటిష్ పాలన కాలంలో, ముఖ్యంగా ఇండియన్ ఫారెస్ట్ యాక్ట్-1865, 1878, 1927ల తర్వాత బలపడింది. అంటే, ఆలయం వెలిసిన కాలానికి చాలా తర్వాతే అటవీ చట్టాలు అమల్లోకి వచ్చాయి.

**"అటవీ శాఖ పుట్టకముందే ఉన్న ఆలయాన్ని ఇప్పుడు అటవీ భూమి ఆక్రమణదారుడిగా ఎలా పరిగణిస్తారు?"**
అటవీ శాఖ ప్రకారం, కొండగట్టు ఆలయ నిర్వహణ కమిటీ 684 బ్లాక్ పరిధిలోని సుమారు 6 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించిందని, అక్కడ అనుమతులు లేకుండా నాన్-ఫారెస్ట్ పనులు చేపట్టిందని ఆరోపించింది.
ఈ ఆరోపణల ఆధారంగా:
**ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్–1980 (సెక్షన్ 2A)**
**వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ – సెక్షన్లు 3A, 3B**
కింద షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

**లీగల్ కోణం – అసలు చట్టం ఏమంటోంది?**
**ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్–1980 ఈ చట్టం ప్రకారం:**

అటవీ భూమిని నాన్-ఫారెస్ట్ అవసరాలకు వినియోగించాలంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. కానీ ఒక కీలక ప్రశ్న ఉంది:
ఆ భూమి నిజంగా "నోటిఫైడ్ ఫారెస్ట్ ల్యాండ్"నా? న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఏ భూమినైనా అటవీ భూమిగా పరిగణించాలంటే:
1. రెవెన్యూ రికార్డుల్లో స్పష్టమైన నమోదు ఉండాలి
2. ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ ఉండాలి
3. సరిహద్దులు స్పష్టంగా నిర్ణయించబడి ఉండాలి

ఈ మూడు అంశాలు లేకుండా నేరుగా చర్యలు తీసుకోవడం న్యాయసమ్మతం కాదని ప్రజలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు.

**దేవాదాయ శాఖ భూముల రక్షణ – చట్టపరమైన హక్కులు**
**హిందూ దేవాదాయ చరం:**
ఆలయాలకు చెందిన భూములు పబ్లిక్ ట్రస్ట్ ప్రాపర్టీగా గుర్తించబడతాయి. శతాబ్దాలుగా వినియోగంలో ఉన్న ఆలయ భూములను అక్రమమని నిర్ధారించాలంటే బలమైన డాక్యుమెంటరీ ఆధారాలు తప్పనిసరి.
కొండగట్టు ఆలయ భూములు తరతరాలుగా దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నాయని, వాటిపై పూజలు, అన్నదానాలు, వాహన పూజలు జరుగుతున్నాయనిఅందరికీ తెలిసిన నగ్నసత్యం .

బేతాళ స్వామి గుడి - అల్లుబండ వద్ద అటవీ మార్కింగ్
వివాదాన్ని మరింత ముదిర్చిన అంశం —— బేతాళ స్వామి గుడి వెనుక అల్లుబండ ప్రాంతాన్ని అటవీ భూమిగా మార్కింగ్ చేయడం.ఇది భక్తుల్లో తీవ్ర అసహనానికి కారణమైంది.

**చట్టపరంగా చూస్తే:**
శతాబ్దాలుగా పూజలు జరుగుతున్న ప్రదేశాన్ని అటవీ భూమిగా ప్రకటించాలంటే పాత రెవెన్యూ రికార్డులు, సర్వే మ్యాపులు, నోటిఫికేషన్లు తప్పనిసరి. అవి లేకుండా చేసిన మార్కింగ్ చట్టపరంగా నిలబడుతుందా? అన్న ప్రశ్న ఇప్పుడు చర్చకు వచ్చింది.


**ఈ.ఓ శ్రీకాంత్ రావు స్పందన:**
కొండగట్టు ఆలయ ఈఓ శ్రీకాంత్ కుమార్ ఈ వ్యవహారంపై స్పష్టంగా స్పందించారు.
"షోకాజ్ నోటీసులు వచ్చిన మాట నిజమే. కానీ దేవాదాయ శాఖ 6 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదు. పూర్తి స్థాయి రికార్డులు పరిశీలించకుండా నోటీసులు ఇవ్వడం సరికాదు."

అన్ని నిర్మాణాలు అప్పటి పరిస్థితుల ప్రకారం ప్రభుత్వ అనుమతులతోనే జరిగాయని ఆయన స్పష్టం చేశారు.

**అన్నదాన సత్రం – అప్పటి మౌనం, ఇప్పటి నోటీసులు**
చట్టపరంగా మరో కీలక అంశం ఏంటంటే ఏళ్ల క్రితం నిర్మించిన అన్నదాన సత్రం ఇప్పుడు శిథిలావస్థలో ఉంది. మరి ఇన్ని సంవత్సరాలలో అటవీ శాఖ ఎందుకు స్పందించలేదు.
"అటవీ భూమి అక్రమమైతే అప్పుడే ఆపాలి. సంవత్సరాల తర్వాత నోటీసులు ఇవ్వడం వెనక ఆంతర్యం ఏమిటి ?."

**ఇక పోతే సాగర్ గెస్ట్ హౌస్ కి అధికారుల అనుమతుల ప్రశ్న**
సాగర్ గెస్ట్ హౌస్ నిర్మాణ సమయంలో అప్పటికలెక్టర్, ఆర్డీఓలు గెట్లు ఏర్పాటు చేసి నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు స్థానికులు చెబుతున్నారు.
చట్టపరంగా ప్రభుత్వ అధికారులు ఇచ్చిన అనుమతుల ఆధారంగా నిర్మాణం జరిగితే తర్వాత దాన్ని పూర్తిగా అక్రమమని తేల్చడం కష్టం. మరి అప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారులు పూర్వపలలు చూడకుండానే ఇచ్చి ఉంటారా? అలా అయితే అనుమతులు ఇచ్చిన పై స్తాయి అధికారి నుండి కింది స్తాయి అదికారి వరకు అందరూతప్పుగానే వారి పనులు చేశారా?

**ఎగ్జిక్యూటివ్ బిల్డింగ్ – రెండు సంవత్సరాల క్రితమే పూర్తి**
రెండు సంవత్సరాల క్రితమే పూర్తైన ఎగ్జిక్యూటివ్ బిల్డింగ్‌పై అప్పట్లో అభ్యంతరం లేకపోవడం కూడా అటవీ శాఖ వాదనను బలహీనపరుస్తోంది. ఒకవేళ అప్పుడే అభ్యంతరం తెలిపి ఉంటే లక్షల రూపాయలు భావన నిర్మాణ కార్చు వృధా అయ్యేది కాదు కదా!!




అలాగే అటవీశాఖ పెర్కున్నటువంటి టాయ్ లెట్స్ కూడా ఈ మద్యే పూర్తి అయ్యన్నట్టు తెలుస్తుంది.

**ఈ షోకాజ్ నోటిస్లపై ప్రాంతీయ పార్టీ నాయకుల నిరసన:**
**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ సందర్శన**
ఈ వివాదం నేపథ్యంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ కొండగట్టు ఆలయాన్ని సందర్శించారు.ఆయన భక్తులతో మాట్లాడి, పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు.
"కొండగట్టు అంజన్న ఆలయం కోట్లాది భక్తుల విశ్వాస కేంద్రం. శాఖల మధ్య సమన్వయ లోపంతో ఈ సమస్య వచ్చింది. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని భూముల హద్దులను స్పష్టంగా నిర్ణయించాలి." అని ఆయన డిమాండ్ చేశారు.

**బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఘాటు స్పందన:**
ఈ అంశంపై బీజేపీ ఎంపీ బండి సంజయ్ కూడా తీవ్రంగా స్పందించారు. "కొండగట్టు అంజన్న ఆలయంపై అటవీ శాఖ చర్యలు హిందూ విశ్వాసాలపై దాడి. భక్తుల సౌకర్యాల కోసం నిర్మించిన అన్నదాన సత్రాలు, టాయిలెట్‌స్‌ను అక్రమం అనడం అన్యాయం." అటవీ-ఎండోమెంట్ -రెవెన్యూ శాఖలు కలిసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు, కలవరపాటు !!**

ఈ మొత్తం వ్యవహారం చూస్తే ప్రజల్లో పలు సందేహాలు:
అటవీ శాఖ ఆలస్యంగా స్పందించిందా?
లేక కొత్తగా సరిహద్దులు మార్చి వివాదం సృష్టించబడుతోందా?
దేవాదాయ శాఖ భూములకు గెట్లు లేకపోవడమే సమస్యకు మూలమా?
ఇప్పటికైనా తొందరపాటు షోకాజ్ నోటీసులు రద్దు చేసీ సంయుక్త సర్వే జరపి హద్దులు సరిగా చూపెట్టి , దేవాదాయ భూములకు స్పష్టమైన హద్దులు, గెట్లు ఏర్పాటు చేయాలి శతాబ్దాల విశ్వాసన్ని కాపాడాలి అని భక్తులు, ప్రజాప్రతినిధుల, మేధావులు డిమాండ్ చేస్తున్నారు.
ఇప్పటికే ఈ విషయంపై విశ్వ హిందూ పరిషద్ కార్యకర్తలు వచ్చి కొండగట్టు ఆలయ ప్రాంతంలో పలుమార్లు నిరసన జరిపారు.

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ఇటుకలు-కట్టడాల సమాహారం కాదు; అది తరతరాల విశ్వాసాల నిలయం.
చట్టాలు అవసరమే. కానీ చట్టాల అమలులో న్యాయం, చరిత్ర, విశ్వాసాల మధ్య సమతుల్యత తప్పనిసరి.

ఈ వివాదం నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోకపోతే, రేపు మరెన్నో పుణ్యక్షేత్రాలు ఇలాగే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

– మేడి సుభాష్ (చొప్పదండి ఆర్ సి)

# న్యూ ఇయర్ ఈవ్ – సంబరాల వెనుక చేదు నిజం

### డిసెంబర్ 31... మనకు నిజంగా అవసరమా ఈ సంస్కృతి?

**ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 వస్తే చాలు...**
రోడ్లపై హడావిడి, బార్ల వద్ద గుంపులు, మద్యం షాపుల ముందు క్యూలు, సోషల్ మీడియాలో "న్యూ ఇయర్ సెలబ్రేషన్స్" పేరుతో అతి ప్రదర్శనలు. కానీ ఒక్క క్షణం ఆలోచిద్దాం... అసలు ఈ సంస్కృతి మనకు ఎందుకు? ఎవరి కోసం? ఏ ఆనందం కోసం?
కొత్త సంవత్సరం అంటే మార్పు. మనలో మార్పు రావాలి. ఆలోచనల్లో, అలవాట్లలో, జీవన విధానంలో మార్పు రావాలి. కానీ మనం చేసేది ఏంటి? తాగుడు, ఆగమావడం, గొడవలు, రోడ్డు ప్రమాదాలు, పోలీస్ కేసులు. ఇదేనా కొత్త ఏడాదికి ఇచ్చే స్వాగతం?
డిసెంబర్ 31 అంటే తప్పనిసరిగా తాగాలా? తాగకపోతే ఆనందించలేమా? ఆనందం అంటే మత్తులో మునగడమేనా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం చెప్పుకునే ధైర్యం మనకు ఉందా?

ప్రభుత్వం ఒక పక్క నియమాలు పెడుతుంది. డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్‌లు పెడుతుంది. రాత్రి గస్తీ కట్టుదిట్టం చేస్తుంది. కానీ మనం మాత్రం "ఒక్క రోజే కదా" అంటూ అన్ని హద్దులు దాటేస్తాం. చివరికి పోలీసులకు చిక్కి కేసులు, జరిమానాలు, లైసెన్సుల రద్దు, కుటుంబాలకు అవమానం. ఇదంతా అవసరమా మిత్రమా?
ఒక్క డిసెంబర్ 31 రాత్రి కోసం జీవితాన్ని రిస్క్‌లో పెట్టాలా? తల్లిదండ్రుల నమ్మకాన్ని, భార్య భర్తల గౌరవాన్ని, పిల్లల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టాలా? ఒక చిన్న మత్తు ఆనందం కోసం పెద్ద నష్టం తెచ్చుకోవాలా?
మన సంస్కృతిలో పండుగ అంటే కుటుంబంతో ఉండటం.
దేవుడిని స్మరించడం. పెద్దలను గౌరవించడం. కానీ డిసెంబర్ 31 పేరుతో మనం తెచ్చుకున్న సంస్కృతి ఏంటి? బీర్ బాటిళ్లు, వైన్ గ్లాసులు, బిగ్గరగా మోగే మ్యూజిక్, అర్ధరాత్రి రోడ్లపై అరుపులు. ఇది మన విలువలకు సరిపోతుందా?
కొత్త సంవత్సరం అంటే కొత్త సంకల్పాలు. మంచి అలవాట్లు మొదలుపెట్టే రోజు. తాగుడు మానేద్దాం అని అనుకోవాల్సిన రోజును, తాగుడుతోనే మొదలుపెట్టడం ఎంత విరోధాభాసం!
డిసెంబర్ 31ని సెలబ్రేట్ చేయకూడదు అని కాదు. కానీ సెలబ్రేషన్ అంటే సంయమనం ఉండాలి. కుటుంబంతో ఒక భోజనం, స్నేహితులతో ఒక మంచి మాట, గత సంవత్సరం చేసిన తప్పులను గుర్తు చేసుకుని ఇకపై చేయనని నిర్ణయం. అదే నిజమైన సెలబ్రేషన్.
ఒక్కసారి ఆలోచించండి... డిసెంబర్ 31 రాత్రి పోలీస్ స్టేషన్‌లో నిలబడి జరిమానా కట్టడం కంటే, ఇంట్లో నిద్రపోవడం మేలా? ఆసుపత్రి బెడ్ మీద పడి కొత్త సంవత్సరం చూడడం కంటే, కుటుంబంతో చిరునవ్వుతో చూడడం మేలా?



సామల విజయ్...



# సిపిఐ 101వ వార్షికోత్సవం

**జానోదయ, గోదావరిఖని, డిసెంబర్ 26:**

సిపిఐ పార్టీ నూట ఒకటో వార్షికోత్సవం సందర్భంగా సీపీఐ రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని భాస్కరరావు భవన్లో మరియు ఖని చౌరస్తాలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోసిక మోహన్ లు సిపిఐ పతకాలను ఆవిష్కరించడం జరిగింది. దానికి ముందు రామగుండం నగరంలోని వివిధ డివిజన్ లోని ఎల్బీనగర్ లో మార్కపురి సూర్య, జవహార్ నగర్ లో సిర్ర మైసయ్య ,జనగామ లో తొడుపునూరి రమేష్ కుమార్, లెనిన్ నగర్ లో తాళ్ళపెల్లి మల్లయ్య ,పవర్ హౌస్ కాలనీ లో మాటిటి శంకర్, రామ్ నగర్ లో చిందం భూమయ్యలు సిపిఐ పతకాలను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం స్థానిక భాస్కరరావు భవన్లో , చౌరస్తాలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు మాట్లాడుతూ దేశంలో " 1925 డిసెంబర్ 26 న సిపిఐ పార్టీ కాన్పూర్ లో ఆవిర్భవించినప్పటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి చట్టసభల్లో కార్మికుల, కర్షకుల,మహిళల కు విద్యార్థులకు అనేక చట్టాలు చేసినటువంటి ఘనత సిపిఐ పార్టీకి ఉందని వారన్నారు. అదేవిధంగా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం నిర్వహించి అనేకమంది కమ్యూనిస్టులు వీరమరణం పొందడం జరిగిందని, తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదెమ్మ, మార్కపురి సూర్య, కన్నం లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్ కుమార్, రంగు శ్రీను,రేణిగుంట్ల ప్రీతం, ఆసాల రమ, శనిగరపు చంద్రశేఖర్ , పార్టీ ప్రజా సంఘాల నాయకులు సంకే అశోక్, శనిగరపు తిరుమల ఆసాల నవీన్, సాదుల శివ, చిందం భూమయ్య, గౌడిశల నరేష్, సిరిసిల్ల మల్లేష్, రాణవేణి సుధీర్ కుమార్, ఎర్రల రాజయ్య, గంగారపు చంద్రయ్య, పడాల కనకరాజు, జగన్ , పుట్ట సాంబయ్య, రేణుక, భాగ్య మున్నీ, జెరిపోతుల దేవయ్య , పోతరాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు కన్నం లక్ష్మీనారాయణ ఎజ్జ రాజయ్య డప్పు రాజు లు పాడిన విప్లవ గేయాలు ఆలపించి, పార్టీ శ్రేణులను చైతన్యపరిచారు.




# స్వర్ణకార సంఘ కళ్యాణ మండప నిర్మాణానికి సహకరిస్తా

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్.

**జానోదయ, గోదావరిఖని, డిసెంబర్ 26:**

రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘ కళ్యాణ మండప నిర్మాణానికి సహకరిస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ అన్నారు. శుక్రవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే దంపతులకు స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బెంగాలీ వర్కర్ల నుండి స్థానిక స్వర్ణకారులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి కృషి చేస్తానని అలాగే స్వర్ణకార కుటుంబాల వివాహానికి గాను కళ్యాణ మండప నిర్మాణానికి ఆర్థిక చేయుత అందిస్తానని అలాగే పుస్తే, మట్టలను కేవలం స్వర్ణకారులు మాత్రమే తయారుచేసి విక్రయించేలా ప్రభుత్వం తరపున జీవో జారీ చేయడానికి గాను అసెంబ్లీలో మాట్లాడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండపర్తి నరహరి, కట్ట నగేష్ కుమార్, పెద్దపల్లి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు రంగు శ్రీనివాస్, నాయకులు శ్రీరామోజు సత్యనారాయణ, గుగ్గిల రవీంద్రాచారి, కట్ట శ్రీధరచారి, శ్రీరామోజు జగన్, గాలిపెల్లి రమేష్, విజయగిరి సదానందం, ప్రసాద్, బొజ్జ పురుషోత్తం, కందుకూరి అశోక్, శ్రీరామోజు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.




# తానూర్ లో ఉచిత వైద్య శిబిరం

- శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బైంసా వారి ఆధ్వర్యంలో.

**జనోదయ,బైంసా,డిసెంబర్ 26:**

గ్రామీణ ప్రాంతాల పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీ వెంకటేశ్వర మల్టీస్ స్పెషలిటీ హాస్పిటల్ ప్రముఖ డాక్టర్ మణికంఠ ఎం.డి జనరల్ ఫిజీషియన్ అన్నారు. శుక్రవారం నిర్మల్ జిల్లాలోని తానూరు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.బైంసా పట్టణానికి చెందిన శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్యం పట్ల గ్రామీణ ప్రజలు నిర్లక్ష్యం, అజాగ్రత్తగా వ్యవహరిస్తారని, వారికి అవగాహన కల్పించేందుకు తరచూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గర్భిణీ స్త్రీలకు స్త్రీ వైద్య నిపుణులు డా. కే.రోజా రాథోడ్ ప్రత్యేక శ్రద్ధ వహించారు. శిబిరంలో విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు సుమారు 100కు పైగా మందికి వైద్య పరీక్షలు నిర్వహించి,అనంతరం వారికి తగిన మందులను అందించామని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర మల్టీస్పెషలిటీ హాస్పిటల్ బైంసా వారికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, కార్యదర్శి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.



# న్యాయపోరాటం విస్తృతం చేస్తాం!

- అక్రమ కూల్చివేతను ఉపేక్షించం.
- బాధితుల ఏడుపు తప్పక తాకుద్ది.
- ప్రభుత్వమే భేషరతుగా భవనం నిర్మించి ఇవ్వాలి.
- ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి.
- రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి.

**జానోదయ, గోదావరిఖని, డిసెంబర్ 26:**

గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో తమలపాకుల వ్యాపారం నిర్వహించే సిరిశెట్టి మల్లేష్ భవనం అక్రమ కూల్చి వేతపై న్యాయపోరాటం విస్తృతం చేస్తాం అని తన డిమాండ్ వినిపించారు రామగుండం బిజెపి నేత కందుల సంధ్యారాణి. ఈ మేరకు శుక్రవారం అఖిలపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపుమేర బాధిత కుటుంబానికి మద్దతుగా రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి విజ్ఞప్తి పత్రాన్ని అందజేశారు. ప్లకార్డులు ప్రదర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే స్థానిక ఎమ్మెల్యేపై మండిపడ్డారు. ఈ సందర్భంగా బిజెపి మహిళా నేత సంధ్యారాణి మాట్లాడుతూ...అక్రమ కూల్చివేతను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం అని అన్నారు. న్యాయం కోసం ఆరు రోజులుగా ప్రధాన చౌరస్తాలో కూల్చిన భవనం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేస్తున్న కుటుంబ సభ్యుల, బాధితుల ఏడుపు తప్పక తాకుద్ధి అని హెచ్చరించారు. ప్రభుత్వమే భేషరతుగా భవనం నిర్మించి ఇవ్వాలి అని, ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు.



# ఇందారం ఓపెన్ కాస్ట్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహ రావు

**జనోదయ మందమర్రి డిసెంబర్ 26:**

ఇందారం ఓపెన్ కాస్ట్ లో ఓవర్ బర్డెన్ కాంట్రాక్టర్ అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెబిసిసిఐ సభ్యులు మంద నరసింహా రావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందారం ఓసీపీలో ఓబి వెలికి తీత పనుల్లో జరిగిన అవినీతికి ఆస్కారమిచ్చిన అధికారులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సింగరేణి ఉన్నతాధి కారుల సహకారంతో కాంట్రాక్టర్ కు విధించిన పెనాల్టీని మాఫీ చేయించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చిన అంశంపై సిబిఐ విచారణ చేపట్టి

బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సింగరేణి సంస్థలో గతంలో అనేక అవకతవకలు జరిగాయని, ముఖ్యంగా డీజిల్, గ్రేడ్, లీడు, బొగ్గు, ఇసుక, పర్చేజ్ వంటి విభాగాల్లో అనేక కుంభకోణాలు జరిగినప్పటికీ వాటిపై ఎలాంటి చర్యలు తీసు కోకుండా కిందిస్థాయి అధికారుల పై తూతూ మంత్రంగా చర్యలు తీసుకొని కుంభకోణాలను బుట్ట దాఖలు చేసిన చరిత్ర సింగరేణి సంస్థ కి ఉందని ఆయన యజమాన్యం తీరుపై తీవ్ర అగ్రహాం వ్యక్తం చేశారు. అనేక విజిలెన్స్ కేసులలో బయటపడ్డ వాటిని కనుమరుగు చేసిన చరిత్ర కూడా ఉన్నతాధికారులకు ఉన్నదని ఆయన మండి పడ్డారు. ఇప్పటికైనా గత పది సం.,గా సింగరేణిలో జరిగిన అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి సింగరేణిని పరిరక్షించాలని ఆయన స్పష్టం చేశారు. సింగరేణిలో ఇప్పటికే కొత్త బొగ్గు బ్లాకులు రాక పోగా, బొగ్గు కరెంటు బకాయిలు పేరుకు పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యం లో, కుంభకోణాల పేరుతో కంపెనీ డబ్బులు అక్రమ మార్గంగా లూటీ చేయటం వల్ల సింగరేణి సంస్థ మనుగడకే ప్రమాదకరంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి ఇందారం ఓసిపి ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి కుంభకోణం లో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని సింగరేణి సంస్థను పరిరక్షించాలని కోరారు.



## మంచిర్యాల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్

# వెల్ఫేర్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

**జానోదయ ఉమ్మడి జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 26:**

మంచిర్యాల జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీజన్ 3 ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఈనెల 19వ తారీకు నుండి 26 తారీకు వరకు ప్రాణహిత స్టేడియం నస్పూర్ కాలనీలో జరిగింది.ఇందులో 10 మండలాలు పాల్గొనడం జరిగింది. ఇందులో ఫైనల్ కీ నస్పూర్ మండల్ మరియు ఆల్ ఈ డి అసోసియేషన్ చేరుకోగా టాస్ గెలిచిన నస్పూర్ మండల్ బ్యాటింగ్ ఎంచుకొని 12 ఓర్లలో 79/5 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్ చేసిన ఆల్ ఈ డి టీం 10.1 ఓవర్లలో 83 సాధించి 6 వికెట్ల తేడాతో విజయం సాధించారు. ఈ యొక్క కార్యక్రమంలో అతిథులుగా మంచిర్యాల కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్, నస్పూర్ మున్సిపల్ ఎక్స చైర్మన్ సుర్మిల వేణు ,ఫోటో & వీడియోగ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లడే రవి ,రాష్ట్ర సలహాదారులు మహిమల కేదార్ రెడ్డి , సౌత్ ఇండియా ప్రతినిధి రాజేశ్వర్ రెడ్డి విజేతలకు కప్పు అందించి విన్నర్ క్యాష్ ప్రైస్ 15000/ రూపాయలు రన్నర్ ప్రైస్ 10000/రూపాయలు అందించడం జరిగింది.యొక్క సీజన్ 3 లో మ్యాన్ ఆఫ్ ద సిరీస్ గా నాస్పూర్ టీం నుండి శ్రీకాంత్ అందుకోవడం జరిగింది. ఇందులో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు అప్పసు రామన్న ప్రధాన కార్యదర్శి పోతరవేణి శ్వాస తిరుపతి ,జిల్లా కోశాధికారి ముక్కెర శ్రీనివాస్ ,నస్పూర్ మండల అధ్యక్షులు అగ్గు సాగర్, ప్రధాన కార్యదర్శి బాణాల రమణాచారి, కోశాధికారి తాటిపాముల రమేష్, అర్గనైజర్స్ చిన్న



సుధాకర్, ఎలీషా, శ్రీపతి రవి, ఆసం పెల్లి రాజబాబు,ఆకుల వేణు,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉదయ్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్,రొమాంటిక్ స్టూడియో అధినేత సాయి రఘుపతిరావు, విజయ డిజి ప్రెస్ శ్రీనివాస్, మహర్షి ల్యాబ్ నరేష్ ,
మంచిర్యాల పట్టణ అధ్యక్షులు రాజబాబు, కోశాధికారి గణేష్,మందమరి అధ్యక్షులు వెంకటస్వామి,కోశాధికారి బద్రి సతీష్ , జైపూర్ అధ్యక్షులు కిషోర్, బెల్లంపల్లి అధ్యక్షులు వేణు,ప్రధాన కార్యదర్శి విక్రమ్, ఐబి తాండూర్ అధ్యక్షులు చందు,మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్లకొండ కనకయ్య గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షులు సతీష్, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి రవి, మాజీ గౌరవాధ్యక్షులు రాము, సబ్ ఆర్గనైజర్స్ చందు, శేఖర్, అభయ్ పాణి, కార్తీక్, జాఫర్, రవి, సాగర్, మధు, జిల్లా నాయకులు మండల నాయకులు వివిధ మండలాల ఫోటో అండ్ వీడియోగ్రఫీ మిత్రులు పాల్గొని ఈ యొక్క సీజన్ 3 క్రికెట్ మ్యాచ్ ని విజయవంతం చేశారు.ఈ యొక్క సీజన్ 3 టోర్నమెంట్లో పాలుపంచుకొని సక్సెస్ చేసిన ఎంపైర్లకు,ఆర్గనైజర్లకు స్పాన్సర్లకి ప్రతి ఒక్కరికి వేరువేరుగా పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు.



# మొదటి ప్రాధాన్యత గ్రామ అభివృద్ధి లక్షంగా జైపూర్ సర్పంచి

**జనోదయ, జైపూర్, డిసెంబర్ 26:**

మంచిర్యాల జిల్లా జైపూర్ గ్రామంలోని ఇందిరమ్మ కాలని లో డ్రైనేజీ లో చెత్త చేరి మురికి నీరు నిల్వవుంది అన్ని తెలియగానే వెనువెంటనే దానిని పరిశుభ్రంగా చెయ్యడానికి జేసీబీ తో క్లియర్ చెయ్యడం జరిగింది. ఇందిరమ్మ కాలనీ నుండి పోలీస్ స్టేషన్ వరకు చెత్త,నీటి పారుదల వేవస్థ ను సక్రమంగా ఉంచాలి అనే లక్షం గా శుభ్రం చెయ్యడం జరిగింది.దీనికి సహకారుంచిన కాంగ్రెస్ నాయకులుఅంబల్ల సంపత్ రెడ్డి, సర్పంచ్ కూన భాస్కర్ ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ కాంగ్రెస్ నాయకులు మనుబోతుల సమ్మయ్య బీస్క్యూలా రవి పళ్ళ రాజు అంబల్ల రవి అరిగేలా శ్రీనివాస్ మంతెన లక్ష్మణ్ ఇరిగిరాల లింగయ్య.కార్యక్రమం కి ముందు వుంది.నూతన సర్పంచ్ గారికి తౌరఫలం అందించారు. వారికీ ధన్యవాదములు తెలిపారు.





# ఎస్టిపిపిలో ఎస్టిలైజన్ అధికారి నియామకం

**జానోదయ ఉమ్మడి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26:**

మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని ఎస్టిపిపి కి నూతన ఎస్టి లైజన్ అధికారిగా ఈఈ దేవేందర్ సింగ్ నియమిస్తూ కార్పోరేట్ జిఎం (పర్సనల్)(ఐఆర్ & పిఎం)ఉత్తర్వులు జారి చేశారని ప్లాంట్ అధికారులు తెలిపారు.శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎస్టిపిపి ఈడి సిహెచ్ చిరంజీవి చేతుల మీదుగా ఈ నియామక పత్రాన్ని అందజేశారు. తనను ఎంపిక చేసిన సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులకు దేవేందర్ సింగ్ కృతజ్ఞతలు తెలిపా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సెంట్రల్ ప్రెసిడెంట్ డి. పంతులా, పవర్ ప్లాంట్ ఎస్టి బ్రాంచ్ ప్రెసిడెంట్ బి. తిరుమల్, ఎస్ ఓ టు ఈ డి. కె. వెంకటయ్య, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కెవి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఠాకూర్ మోహన్ సింగ్ పాల్గొన్నారు.

## జీవో 252పై జర్నలిస్టుల పోరాటానికి

# డీజేఎఫ్(డబ్ల్యూ) సంపూర్ణ మద్దతు

**జానోదయ పెద్దపల్లి జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26:**

జర్నలిస్టుల ఆశలపై నీళ్లు చల్లేలా, ఒక్క జీవోతో వేలాది మంది పాత్రికేయుల అక్రిడిటేషన్లకు కోత విధించే జీవో నంబర్ 252ను తక్షణమే సవరించాలని డీజేఎఫ్(డబల్యూ) రాష్ట్ర ప్రచార కార్యదర్శి, పెద్దపెల్లి ఇంచార్జ్ **సామాల విజయ్** డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లుగా కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయకుండా, ఇప్పుడు అడ్డగోలుగా నిబంధనలు పెట్టడం జర్నలిస్టు సమాజానికి తీరని అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డెస్క్ జర్నలిస్టులు, ఫీల్డ్ జర్నలిస్టులుగా విభజన చేయడం జర్నలిజం మౌలిక స్ఫూర్తికి విరుద్ధమని, మీడియా కార్డుల పేరుతో వృత్తిలో చీలికలు తెచ్చే ప్రయత్నం తక్షణమే ఆపాలని **సామాల విజయ్** స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టుల ప్రాథమిక హక్కులను కాలరాసేలా ఉన్న ఈ జీవోను యథాతథంగా అమలు చేయడం తగదన్నారు.
డిజిటల్ మీడియా గుర్తింపు అభినందనీయమే అయినా, కార్పొరేట్ మీడియాలకు మాత్రమే లబ్ధి చేకూరే విధంగా నిబంధనలు ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న, మధ్య, స్వతంత్ర జర్నలిస్టులకు న్యాయం జరగాలన్నారు. అన్ని జర్నలిస్టు సంఘాలను సంప్రదించి, వివక్షలేని కొత్త జీవో తీసుకురావాలని, లేకపోతే ఐక్య ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.
అలాగే శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టు సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జరిగే "రౌండ్ టేబుల్ సమావేశం" కి డిజేఎఫ్(డబ్ల్యూ) పూర్తిగా మద్దతు ఇస్తున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

